కాశీభట్ల వేణుగోపాల్

# 'నేనూ-చీకటి' నవల-పరిశీలన





గెద్ద ప్రకాశరావు

డా. జి. అరుణకుమారి
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

# చైతన్యస్రవంతి

## I

వర్తమానాన్ని వర్తమాన జీవితానుభవాల నుండి దర్శించిన ఆత్మకథా సదృశం కాశీభట్ల వేణుగోపాల్ రచించిన 'నేనూ-చీకటి' నవల. ప్రతి మానవునిలో రెండు పార్శ్వాలు- బాహ్యజీవి, అంతరజీవి. నీటిలో మునిగి ఉన్న మంచుకొండ లా, నివురుగప్పిన నిప్పులా అంతరజీవిలో బహిర్గతంకాని చీకటికోణాలు అనేకం విరామంలేని ఆలోచనల రూపంలో నిరంతరం అటూఇటూ స్థిరత్వం, క్రమత్వం లేకుండా కొనసాగిపోతుంటాయి. ఒక వ్యక్తికి ఒక రోజులో 6,04,000 ఆలోచనలు కలుగుతాయని, ఒక క్షణానికి ఏడు ఆలోచనలు కలుగుతాయని మనోవిజ్ఞాన అధ్యయనం తెలియజేస్తుంది. బహిర్గతంకాని ఆలోచనలకు రూపకల్పన చేస్తే ఎలా ఉంటుందనే కోణంలో కొనసాగిన నూత్న మనస్తత్వ ప్రక్రియే ఈ నవలకు ఆకరం. శరీరమనే తోలుతిత్తిని లోపలికి, లోపల ఉన్న శరీరభాగాలను వెలికి ఉంచినట్లుగా మానవ మనోభావాలను వ్యక్తపరచినట్లయితే ఏవగింపు కలుగుతుందనేది సత్యం.

ఆలోచనలు వ్యక్తిని బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా అంతర్ముఖుణ్ణి చేస్తాయి. చేతనాచేతనావస్థలో మనస్సు పొరలలో బాహ్య జగత్తు సంపర్కంతో కలిగే భావసంచారాన్ని సంకోచంలేకుండా యథాతథంగా వ్యక్తంచేయగలిగిన శిల్పమే చైతన్యస్రవంతి.

అధునిక రచనలలో వ్యక్తి ప్రధానం. చైతన్యస్రవంతి నవలల్లో పాత్రల మనోగతం ప్రధానం. వ్యక్తావ్యక్త స్థితిలోని మనోభావాలు అనుభూతికి, అనుభవానికి అధారం. లౌకికప్రపంచ ప్రదర్శనానుభవం అనుభూతమై ఆలోచనలకు దారితీస్తుంది. అ అనుభవాలు భూతభవిష్యత్ వర్తమాన కాలాలకు సాగిపోయే జ్ఞాపకాలై ఆలోచనలరూపంలో వ్యక్తమౌతాయి. క్రమబద్ధంలేని ఆలోచనలు ఒకచోట అలజడిని సృష్టించడం, శబ్దానికి అస్పష్టతను సృష్టించడం, ప్రతీకల చిత్రణలో సత్య ప్రకటన గావించడం, పదప్రయోగంలో కొత్తదనం చూపడం, అనుభూతి ప్రకటనలో నవ్యతను సాధించడం, స్పందన ద్వారా వాస్తవికతను సాధించడం చైతన్యస్రవంతి శిల్పంలో కనిపించే మౌలికాంశాలు. ఉత్తమపురుషలో కథనం కనిపిస్తుంది. చైతన్యస్రవంతి నవలల్లో ఆలోచనలకు లోనయ్యేది అధికంగా పురుష పాత్రలే. లైంగికభావాలు, సంకుచితభావాలు, భావోద్వేగం, అసంతృప్తి, స్వేచ్ఛా ప్రవృత్తి, రహస్యప్రవృత్తి, సామాజిక కాఠిన్యం, తిరుగుబాటు, సౌందర్యం, అసౌందర్యం, వ్యంగ్యధోరణి... లో ఎగసిపడే కలగాపులగపు ఆలోచనలకు అక్షరాకృతిని కల్పించేది చైతన్యస్రవంతి. స్వప్నమార్మికత, అధివాస్తవికత వలన భావసంక్లిష్టత ఈ రచనలలో కనిపిస్తుంది. ఈ కోణంలో ఆలోచిస్తే ఈ ఛాయలున్న రచనలు సాహిత్యంలో అక్కడక్కడా స్ఫురిస్తాయి. 'సుషుప్తిలోన స్వప్నవీధీ యథేష్ట సంచారకలన మేము మరచిన' కృష్ణశాస్త్రి అన్వేషణలో, 'ఆలోచించే ఊహలని ఉదాహరిస్తే గవర్నమెంటు వాళ్ళు

కేసు పెడతారు' అనే ఆరుద్ర వైనతేయులు కథ లోని వైన్ సేవించేవారి పొంతనలేని ప్రేలాపనలో, శ్రీశ్రీ ఒసే తువ్వాలందుకో కథలో ఈ ధోరణి కనిపిస్తుంది.

సృజనాత్మక మానసిక ప్రేరణ అని, వ్యక్తిలో నిరంతరం మారుతూ ఉండే గతిశీల భావాలను ప్రదర్శించే శిల్పమని, గతిశీల పునరుజ్జీవన ప్రక్రియ అని, ఎడ తెగక కొనసాగే కాలమని పలువురు చైతన్యస్రవంతి మూలాన్ని వివరించడంలో భిన్నాభిప్రాయాలను వెల్లడించారు.

ప్రజలలో అసంతృప్తి చెలరేగడం, విలువలు పతనంకావడం, కళాతత్వానికి ప్రాధాన్యం పెరిగి సృజనాత్మక శక్తి లోపించడం, సంప్రదాయంపై తిరుగుబాటు, కాలంతోపాటు నిరంతరం కొనసాగే మార్పు, 1900-25 మధ్యకాలంలో విజ్ఞానరంగం అభివృద్ధి చెందటం, ఆధ్యాత్మిక శూన్యం ఏర్పడి ప్రాపంచిక దృష్టి అధికంకావడం, వాస్తవం ఒక మాయలా, ఆలోచనలు వికృతంగా పరిణమించటం... చైతన్యస్రవంతికి మూలకారణాలుగా నిలిచాయి. Supramental time consciousness, stream of consciousness influx, consciousness technique అనే పదాలు తత్వశాస్త్రంలోనే వ్యవహరిస్తున్నారు. ఇది తత్వశాస్త్రంలో ఆధ్యాత్మిక ప్రపంచానికి పరిమితమైనది. ఏ రంగంలోని చైతన్యస్రవంతి అయినా తర్కానికి లొంగనిది.

"Into the same river you could not step twice for other waters are flowing' అని హెరాక్లిటస్ ప్రవహించే నదిలో ప్రవేశం నిత్యనూతనమన్నారు. వ్యక్తి ఆలోచనలు, జీవితం నదీప్రవాహం వంటివి.

II

జి. ప్రకాశరావు కాశీభట్ల వేణుగోపాల్ 'నేనూ-చీకటి' నవల-పరిశీలనలో మనోవిశ్లేషణాత్మక, చైతన్యస్రవంతి నవలలను గురించి విశ్లేషించారు. తెలుగుసాహిత్యంలో మనోవిశ్లేషణాత్మక నవలలను, చైతన్యస్రవంతి నవలలను పరిచయం చేస్తూ ఈ రెండింటికీ మధ్యవున్న తారతమ్యాన్ని గుర్తించవలసిన అవసరం ఉందంటూ పరిశోధకుడు ఈ అంశాన్ని నిశితంగా పరిశీలించి చైతన్యస్రవంతి లక్షణాలను, ప్రయోజనాలను లక్షణ సమన్వితంగా నిరూపించారు.

చైతన్యస్రవంతి నవలా రచయితలు వ్యక్తి వ్యక్తిత్వాన్ని, అనుభవాన్ని కళాత్మక సంవేదనగా సృష్టించారు. ఈ ప్రయత్నంలో భాగంగా ఆంతరజీవితమే బాహ్యజీవితానికి ఆధారమని, వ్యక్తి బహిరాంతర జీవిత విధానాలను సూక్ష్మదృష్టితో పరిశీలించి సమన్వయపరిచారు. బహిరాంతర జీవిత విధానాలకు సత్యదృష్టి, శ్రద్ధ, భక్తి, ఆకాంక్ష, సర్వసమర్పణ అంతరంగ జీవిత పరమార్థమనేది కొందరి దృష్టి అయితే, వ్యక్తులు సామాజిక పరిస్థితుల నుండి, వాస్తవాల నుండి తప్పించుకోలేరన్నది వాస్తవికవాదుల దృష్టి. ఫ్రెంచ్, ఆంగ్లసాహిత్యంలోని చైతన్యస్రవంతి సిద్ధాంతాలను, చారిత్రక నేపథ్యాన్ని, లక్షణాలను సమగ్రంగా తెలుగుసాహిత్యానికి అందించాల్సిన అవసరం ఉంది. దీనిపై పరిశోధన చేసిన జి. ప్రకాశరావు ఈ కోణంలో మరింత కృషిచేసి అనేక అంశాలను తెలుగుసాహిత్యానికి అందించగలరని ఆశిస్తున్నాను.